సాక్షి
నిజామాబాద్
బుధవారం ॥ 14 ॥ జూన్ ॥ 2023



వర్సిటీలో పస్తులుంటున్నాం

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉండడంతో వర్సిటీలో తాము ఆకలితో పస్తులుంటున్నామని విద్యార్థులు ఆగ్రహంతో ధర్నాకు దిగారు.

- 8లో ▸



ఆదుకుంటున్న 'కాకతీయ'

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువలో నీళ్లు ఉండడంతో రైతులు పంట సాగుకు సిద్ధమవుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /27.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

మహిళా సంఘాల వడ్డీ సొమ్ము ఖాతాల్లో జమ

- రూ.72.54 కోట్లు

మోర్తాడ్(బాల్కొండ) : బ్యాంకు లింకేజీ రుణాలకు మహిళలు చెల్లించిన వడ్డీ సొమ్ము ఎట్టకేలకు వాపస్ వచ్చింది. మార్చి 8న నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 15 నెలల వడ్డీని వాపసు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రొసీడింగ్‌లను జారీ చేసింది. అప్పట్లోనే నాయకులు, అధికారులు మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ సొమ్ము వాపసుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందించారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.72 కోట్ల, 54 లక్షల వడ్డీ సొమ్ము వాపసు రావాల్సి ఉండగా ఆర్థిక శాఖ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉండిపోయింది. ప్రొసీడింగ్‌లను ఇచ్చినా తమ ఖాతాల్లో వడ్డీ సొమ్ము ఇంకా జమకావడం లేదని మహిళలు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఆర్థిక శాఖ రెండు రోజుల కింద వడ్డీ సొమ్ము జమ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంగళవారం జిల్లాలోని మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమ చేశారు. ఇప్పుడు జనవరి 2019 నుంచి మార్చి 2020 వరకు 15 నెలల వడ్డీ మాత్రమే వాపసు వచ్చింది. మిగిలిన నెలల బకాయిలను ప్రభుత్వం విడుదల చేస్తేనే మహిళా సంఘాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నేటి నుంచి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్ : నేటి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. జిల్లాలోని మొత్తం 12 సెంటర్లలో పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు గంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని, మాస్ కాపీయింగ్‌కు తావు లేదని డీఈవో దుర్గాప్రసాద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎవరైనా మాస్ కాపీయింగ్‌కి పాల్పడితే విద్యార్థితో పాటు ఇన్విజిలేటర్, సీఎస్ అందరూ యాక్ట్ 25/97 కింద శిక్షార్హులవుతారన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు నిషేధం అని ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లవద్దన్నారు. సందేహాలుంటే కంట్రోల్ రూమ్ 90302 82993లో సంప్రదించాలన్నారు.

నేడు తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం

సుభాష్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నియోజకవర్గ స్థాయిల్లో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి న్యూట్రిషన్ కిట్లను అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ ఉంటుందన్నారు. ఉద్యోగులను సన్మానించాలన్నారు.


పలు రైళ్లు ఆలస్యం

ఖలీల్‌వాడి : నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు రావాల్సిన దేవగిరి ఎక్స్‌ప్రెస్ రాత్రి 8 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంది. ఈ రైలు ఐదు గంటల పాటు ఆలస్యం కావడంతో ముంబాయి వెళ్లాల్సిన ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. అలాగే నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వయా విశాఖపట్నం నుంచి వచ్చే రైలు సాయంత్రం 6 గంటలకు రావాల్సి ఉండగా రాత్రి 8:30 గంటల వరకు కూడా రాకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. రైల్వే అధికారులు మాత్రం ఈ విషయమై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

నేటి నుంచి ఎస్సై, కానిస్టేబుళ్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఖలీల్‌వాడి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు బుధవారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారు. అభ్యర్థులు తమ ఇంటిమేషన్ లెటర్లు, మెమోలతో పాటు అన్ని రకాల సర్టిఫికెట్లను తీసుకొని ఉదయం 9 గంటలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో హాజరుకావాల్సి ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సివిల్ ఏఆర్ పోస్టులు ఉండగా వీటికి 5,285 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ మెయిన్ పరీక్ష రాశారు. కానిస్టేబుల్, ఎస్సై ఫలితాలను టీఎస్ ఎల్‌పీఆర్‌బీ ఏప్రిల్ 30న విడుదల చేశారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు ఇంటిమేషన్ లెటర్‌లో తమకు కేటాయించిన తేదీల ప్రకారం సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

మరోసారి విజిలెన్స్



రెండోసారి తనిఖీలు నిర్వహించడంపై తెలంగాణ వర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వీసీ ప్రొఫెసర్ రవీందర్ చేపట్టిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, ఈసీ అనుమతి లేకుండా విచ్చలవిడిగా కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుబారా తదితర అంశాలపై ఆయా విభాగాల ఉద్యోగులను సుదీర్ఘంగా ప్రశ్నించారు. కాగా అధికారుల బృందం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆరతిలను పరిపాలనా భవనంలోకి రావాలని ఆదేశించినా వారు అందుబాటులో లేనట్లు తెలిసింది.

- తెలంగాణ వర్సిటీలో ప్రభుత్వ చర్యలు వేగవంతం
- పలు విభాగాల్లో రికార్డుల పరిశీలన
- ఉద్యోగులను సుదీర్ఘంగా ప్రశ్నించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు

తెయూ (డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. తెయూ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ గుప్తాపై అక్రమాలు, అవినీతి, నిధులు దుబారా చేశారని పాలకమండలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలిసారి ఈ నెల 6న వర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రామచంద్రాపురం యూనిట్ (ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ) అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు నేతృత్వంలో దాడులు చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల్లోనే మంగళవారం రెండవసారి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం దాడులు చేసింది. నలుగురు అధికారులు ఉదయం 11 గంటలకు తెయూ పరిపాలనాభవనం చేరుకున్నారు. అకౌంట్స్, ఇంజనీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఏవో కార్యాలయం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ లో సాయంత్రం 4.40 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. తొలిసారి తమ వెంట తీసుకెళ్లిన ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్, సీపీయూలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. తమ పరిశీలనలో తేలిన కొన్ని అంశాలపై మరింత విస్తృత సమాచారం తీసుకోవడానికి అధికారులు మరోసారి వర్సిటీకి వచ్చినట్లు సమాచారం. తెయూ వీసీ గా ప్రొఫెసర్ రవీందర్ బాధ్యతలు తీసుకున్న ఈ రెండేళ్ల కాలంలో చేపట్టిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, ఈసీ అనుమతి లేకుండా విచ్చలవిడిగా కొనుగోళ్లు చెల్లింపులు, నిధుల దుబారా తదితర అంశాలపై మరోసారి ఆయా విభాగాల ఉద్యోగులను ప్రశ్నించారు. రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వీసీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలు, తదితర అంశాలను రికార్డు చేసుకున్నారు. సోదాల సమయంలో ఆయా విభాగాల తలుపులు మూసివేసి తనిఖీలు చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ఆరతిని పరిపాలనా భవనంలోకి రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఆ సమయంలో వారు అందుబాటులో లేకపోవడంతో రాలేకపోయినట్లు తెలిసింది.

అకౌంట్స్ విభాగంలో..

అకౌంట్స్ విభాగంలో సూపరింటెండెంట్ భాస్కర్‌ను, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్‌లను సుదీర్ఘంగా విచారించారు. పలు అంశాలపై అ ధికారులు ప్రశ్నలు వర్షం కురిపించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా పదోన్నతులు పొందిన రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చిన పదోన్నతులు, దినసరి కూలీల పేరిట చెల్లించిన వేతనాలు వివరాలను తీసుకున్నారు. అధికారుల ఎదుటే సాయాగౌడ్‌కు జూ.అసిస్టెంట్‌కు పదోన్నతుల విషయంలో వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. అకడమిక్ కన్సల్టెంట్లకు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి చెల్లిస్తున్న జీతాలకు సంబంధించి వివరాలు నమోదు చేసుకున్నారు. సాయంత్రం 4.40 గంటలకు తాము సేకరించిన వివరాలతో నలుగురు అధికారులు తిరిగి వెళ్లిపోయారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల సమయంలో వర్సిటీలో వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్య అందుబాటులో లేరు. వీసీ అయితే ఈనెల 6 నుంచి పత్తాలేకుండా పోయారని, ఆయన వైఖరి వల్లే తమకు జీతాలు రావడం లేదని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విమర్శిస్తున్నారు. విజిలెన్స్ అధికారుల సోదాలు క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది.



తెయూలో తనిఖీలకు వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



తనిఖీల అనంతరం వెళ్లిపోతున్న అధికారులు

తెలంగాణలో అవినీతి పాలన

మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు ప్రకాశ్ జవదేకర్ ఆరోపణ

ఆర్మూర్ : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అవినీతి మయమైన పాలన సాగుతోందని, మంత్రులందరూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుడు ప్రకాశ్ జవదేకర్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గ మోర్చాల సంయుక్త సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గం కన్వీనర్ పాలెపు రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జవదేకర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రూ. 40 వేల కోట్ల వ్యయం కాగల కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని రూ. ఒక లక్ష 20 వేల కోట్లకు పెంచడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి దాగి ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోని 140 కోట్ల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం కోసం మాత్రమే పాలన సాగిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ పాలనను అగ్ర రాజ్యాలైన అమెరికా, ఇంగ్లాండ్ అధ్యక్షులే కొనియాడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా నిరుద్యోగ యువత, దళితులను, మహిళలను, రైతులను మోసం చేస్తున్నారన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ నినాదంతో ప్రధాని మోదీ ముందుకు వెళ్తుంటే సీఎం కేసీఆర్ ఆయనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీదలకు ఉచిత రేషన్ బియ్యం, వ్యవసాయ రంగానికి రుణాలు, ముద్ర లోన్, సౌచాలయాల నిర్మాణాల గురించి వివరించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వివిధ మోర్చాల ప్రతినిధులకు సూచించారు. అంతకు ముందు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో మూడు రైల్వే బ్రిడ్జిలు నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయన్నారు. 40 ఏళ్లుగా యూపీఏ ప్రభుత్వం సాధించలేని మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని సైతం తమ ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. ఈ సమ్మేళనంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మి నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మి నారాయణ, రాష్ట్ర నాయకులు భూపతిరెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్‌రెడ్డి, పల్లె గంగారెడ్డి, నాయకులు వినయ్ రెడ్డి, జెస్సు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ మోర్చా ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్

మహిళల అభ్యున్నతికి పెద్దపీట


- వేల్పూర్‌లో పసుపు ఉత్పత్తుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/కమ్మర్‌పల్లి : మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వేల్పూర్ మండలం లక్కోర వద్ద ఏఎన్‌జీ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకంగా బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వితంతువులకు పెన్షన్లు అందిస్తున్నారని, వృద్ధాప్య పెన్షన్ల పంపిణీలోనూ మహిళలకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2014 నాటికి 18 శాతానికి పరిమితమైన కాన్పులు నేడు 61 శాతానికి పెరిగాయన్నారు. స్వరాష్ట్రంలో తొమ్మిదేళ్ల కాలంలో నాలుగురేట్లు ఎక్కువగా రూ. 1213 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామన్నారు. అప్పట్లో స్త్రీనిధి కింద రూ. 28 కోట్లు మాత్రమే ఇవ్వగా, తమ ప్రభుత్వం రూ. 259 కోట్లు అందజేసి పదిరేట్లు పెంచిందన్నారు. రూ. 43 లక్షల ప్రభుత్వ పెట్టుబడితో వేల్పూర్ మండలంలో నియోజకవర్గ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పసుపు ఉత్పత్తుల ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయిస్తానని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. వేల్పూర్‌లో విజయవంతంగా కొనసాగితే నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే రూ. 2 కోట్ల 81 లక్షలు వెచ్చించి 51మహిళా సంఘ భవనాలను నిర్మింపజేశానని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాల చెక్కు అందజేశారు. మహిళలు తయారు చేసిన వస్తువుల స్టాల్‌ను కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి జీపీ కార్యదర్శి గంగాజమునకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందించారు. దీనికి ముందు మంత్రి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు మహిళలు బోనాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. సమావేశంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నర్సింహానాయుడు, వేల్పూర్ ఏఎంసీ ఛైర్మన్ అరుణ, నియోజకవర్గంలోని మండలాల మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



లక్కోరలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలుపుతున్న ఔత్సాహికులు
- నేడు రక్తదాతల దినోత్సవం



ఆపదలో ఆపద్బాంధవులు

నిజామాబాద్ సిటీ : అవసరమైన ప్రతిసారీ రక్తదానం చేసి స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తున్నారు పలువురు. మరికొందరు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ యువతలో చైతన్యం తెస్తున్నారు. సమాజ సేవలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. ప్రమాదాల్లో, ఇతర అత్యవసర సమయాల్లో ఎవరికి రక్తం అవసరమైనా స్వచ్ఛందంగా అందిస్తున్నారు. నేడు రక్తదాతల దినోత్సవం.

సమాజసేవ చేయాలని..



సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో రక్తదానం చేస్తున్నాను. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేశాను. 2005 నుంచి ఇప్పటిదాకా రక్తదానం చేస్తున్నాను. నేడు గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్నాను.
– నాగేందర్, కోర్టు ఉద్యోగి

77 సార్లు రక్తదానం చేశా..



రక్తదానం మిషన్లలో ఉత్పత్తి అయ్యేది కాదు. ప్రతి రక్తం బిందువు ఒకరికి ప్రాణం పోస్తుంది. ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయాలి. 25 ఏళ్ల క్రితం రెడ్‌క్రాస్‌లో చేరా. ఇప్పటిదాకా 77సార్లు రక్తదానం చేశాను.
– తోట రాజశేఖర్ టౌన్–2 ఏడీ, ట్రాన్స్‌కో

రుణ ప్రణాళిక @ రూ. 8,713 కోట్లు

- పంట రుణాల లక్ష్యం రూ. 4062.20 కోట్లు
- ఎస్‌హెచ్‌జీ లింకేజీకి రూ. 753 కోట్లు
- జిల్లా రుణ ప్రణాళిక ఖరారు చేసిన అధికారులు



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, అధికారులు

సుభాష్‌నగర్ : జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.8,713.34 కోట్లుగా నిర్ధేశించారు. అందులో పంట రుణాల లక్ష్యం రూ.4,062.20 కోట్లు కాగా, ఏటీఎల్ (అగ్రికల్చర్ టర్మ్ రుణాలు) రూ.2,506 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు లింకేజీ (ఐకేపీ) లక్ష్యం రూ.653 కోట్లు, అర్బన్ ప్రాంతంలో (మెప్మా) రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ధేశించుకున్నారు. ఇతర విభాగాలు ఎంఎస్‌ఎంఈకు రూ.1,646.87 కోట్లు, ఓపీఎస్‌కు రూ.298.17 కోట్లు, ఎన్‌పీఎస్‌కు రూ.200 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా 2023–24వ ఆర్థిక సంవత్సరానికి రుణాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు వివిధ విభాగాలకు కలిపి రూ.914.96 కోట్లు (11.74శాతం) ప్రజలకు రుణాల రూపంలో అందజేశారు.

గతేడాది 71.72 శాతం..

గతేడాది రుణ ప్రణాళిక లక్ష్యం రూ.7798.38 కోట్లు కాగా, లక్ష్యానికి మించి రుణాలు రూ.13,690.37 కోట్లు (175.56శాతం) అందజేశారు. కానీ పంట రుణాలు లక్ష్యం చేరలేదు. పంటరుణాలు రూ.3,846.9 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, రూ.2,758.68 కోట్లు (71.72శాతం) మాత్రమే పంపిణీ చేశారు. రూరల్ ప్రాంతాల్లో బ్యాంకు లింకేజీ 249.4 శాతం, అర్బన్ ప్రాంతంలో 187.47శాతం వరకు రుణాలిచ్చారు.

రైతుల ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలి

లక్ష్యం మేరకు పంట రుణాలు మంజూరు చేసి రైతుల ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా సూచించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకుల వారీగా రుణాల మంజూరుపై బ్యాంకు మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా చిత్రామిశ్రా మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకుల వారీగా పంట రుణాలు, ప్రభుత్వ పథకాలు, రుణాలు సకాలంలో మంజూరు చేయాలన్నారు. వీధి రుణాలు అర్హులందరికీ మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా 2023–24కు గాను జిల్లా రుణ ప్రణాళికను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ చందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, మెప్మా పీడీ రాములు, ఆర్‌బీఐ అధికారి అనిల్‌కుమార్, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్, అన్ని బ్యాంకుల అధికారులు, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇండోనేషియా అమ్మాయి.. సాలూర అబ్బాయి



బోధన్‌రూరల్: సాలూరకు చెందిన గోనె సావిత్రి గంగాధర్‌ల మూడో కుమారుడు నీలకంఠంకు ఇండోనేషియా దేశానికి చెందిన డీజె న్ దెబోరతో వివాహం జరిగింది. సోమవారం బోధన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహం వైభవంగా నిర్వహించారు. ఇండోనేషియా నుంచి అమ్మాయి కుటుంబ సభ్యులు వారం క్రితం సాలూర వచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం పెద్దల సమక్షంలో పెండ్లి నిశ్చయించుకున్నారు. వీరిద్దరూ ఇజ్రాయిల్‌లో పీహెచ్‌డీ చదువుకునే సమయంలో ప్రేమించుకున్నారు. వివాహ వేడుకల్లో బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలురా షకీల్, ఎంపీటీసీ కండెల సవిత సంజీవ్ పాల్గొన్నారు.

నిన్ను మరిచిపోలేమయ్యా..




శేఖర్ విగ్రహంతో కుటుంబ సభ్యులు



భిక్కనూరు : కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన వ్యాపారి పబ్బ శేఖర్ (42) గత ఏడాది మార్చి 30న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎన్నో ఆశలతో, సుందరంగా నిర్మించిన ఇంట్లోకి ప్రవేశించకముందే ఆయన చనిపోవడంతో ఇల్లు అలాగే ఉండిపోయింది. ఏడాది తరువాత తేరుకున్న కుటుంబ సభ్యులు గృహ ప్రవేశం చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే రూ.1.90 లక్షలు వెచ్చించి సిలికాన్‌తో శేఖర్ విగ్రహాన్ని ముంబైలో తయారు చేయించారు. నాలుగు రోజుల క్రితం శేఖర్ విగ్రహంతో గృహ ప్రవేశం చేశారు. ఇంట్లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్యం పూజలు చేస్తున్నారు. శేఖర్‌కు భార్య లత, ఇద్దర కుమార్తెలు, సోదరుడు, తల్లిదండ్రులు ఉన్నారు. వారంతా శేఖర్ విగ్రహాన్ని చూసి ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. సిలికాన్ పదార్థం చర్మాన్ని పోలి ఉండటంతో విగ్రహాన్ని చూస్తే నిజంగా బతికే ఉన్నాడా ? అని అనిపిస్తోంది. శేఖర్ తండ్రి నాగరాజు మాట్లాడుతూ తన కొడుకు కుటుంబం కోసం ఎంతో కష్టపడ్డాడని, రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందన్నాడు. గృహ ప్రవేశం రోజున శేఖర్ విగ్రహం సాక్షిగా కార్యక్రమాలు నిర్వహించుకున్నామని తెలిపారు.

తెగుతున్న బంధాలు!

- ఆస్తి తగాదాలతో రక్త సంబంధీకుల మధ్య పెరుగుతున్న దూరం
- ఠాణాలు, కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు
- దాడులు చేసుకుంటున్న వైనం



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో గత నెల 25న ఆస్తుల విషయంలో గొడవతో అన్న తలపై తమ్ముడు సుత్తితో బాదాడు. పాల్వంచ మండలం ఇసాయిపేటలో ఆస్తి కోసం బతికున్న నానమ్మ చనిపోయిందని ఏకంగా మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించాడో వ్యక్తి.

పాల్వంచ మండలం ఎలుపుగొండలో భూమి పంపకాల్లో తేడాలు వచ్చాయని గత కొన్నేళ్లుగా తగవులాడిన అన్న దమ్ములు పలు మార్లు కుల పంచాయతీలో మాట్లాడుకున్నారు. చివరికి గతేడాది తమ్ముడు కిరాయి హంతకులకు సుపారి ఇచ్చి అన్నను హత్య చేయించి కటకటాల పాలయ్యాడు.

భూముల ధరలు పెరుగుతున్నట్టే వివాదాలు పెరుగుతున్నాయి. ఆస్తి విషయంలో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, తండ్రి, కొడుకుల మధ్య వైరం పెరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకోవడం, చంపుకోడానికి వెనుకాడడం లేదు. గుంట భూమి కోసం పోలీస్ ఠాణాల చుట్టూ తిరుగుతూ దానిని అమ్మితే వచ్చే డబ్బుల కన్న రెట్టింపు ఖర్చు చేస్తున్నారు. కానీ రాజీ పడడం లేదు. కొన్ని కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు గ్రామాల్లో ఉమ్మడిగా కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడ్డారు.

దూరం చేసుకుంటున్నారు..

ఆస్తి గొడవల నేపథ్యంలో ఒకరినొకరు తిట్టుకోవడం, కొట్టుకోవడం ద్వారా పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడకు వెళ్లినా పోలీసులు గ్రామ పెద్దలు, కుల పెద్దలను కూర్చుండబెట్టుకుని మాట్లాడుకోమని సలహా ఇస్తున్నారు. ఎక్కడా పరిష్కారం కాని పరిస్థితుల్లో దాడులకు తెగబడుతున్నారు. హత్యలకూ వెనుకాడడం లేదు. కోర్టుల్లో కేసులు వేసుకుని ఏళ్ల తరబడిగా తిరుగుతున్నారు. ముఖ్యంగా ఆస్తి తగాదాల విషయంలో తిరగడానికి ఇతర ఖర్చులకు రూ.లక్షలు వెచ్చిస్తు న్నారు. ఎవరో ఒకరు కొంత తగ్గితే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కానీ తగ్గేదేలే అన్న ట్టుగా వ్యవహరిస్తూ రక్త సంబంధాలను దూ రం చేసుకుంటున్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం



గెట్టు పంచాయితీలతో పాటు ఆస్తి తగాదాల విషయంలో అన్న దమ్ములతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. కౌన్సెలింగ్ వల్ల చాలా కేసులు పరిష్కరించాం. ఇంకా కొన్ని కేసులు గ్రామాల్లోని పెద్ద మనుషుల చొరవతో పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తున్నాం.

– సంతోష్ కుమార్, ఎస్సై, మాచారెడ్డి

ప్రజావాణికి 71 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 71 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, డీఆర్డీవో చందర్, ఆర్డీవో రవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

కంకర క్వారీని నిలిపేయాలి

డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామంలో కంకర క్వారీతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే క్వారీని నిలిపేయాలని గ్రామస్తుడు టి అనిల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. క్వారీ నుంచి వెలువడే దుమ్ము, ధూళి ద్వారా శ్వాసకోశ సమస్యలు, బ్లాస్టింగ్ వల్ల బోరుబావిలో మోటార్లు పడిపోతున్నాయని తెలిపారు.

నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలి

నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో జనాభా నాలుగు లక్షలకు మించిపోయిందని, ఈ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేషనల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ సుసీల్ జాదవ్ డిమాండ్‌చేశారు. ఈమేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు లక్ష్మీదేవి, అభితోష్, మహాసన్ బిన్ ఉమర్ బహమేద్, షేక్ ఫజల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

మాక్లూర్: జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరుస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోర్గాం (కె) శివారులో నిజామాబాద్ ప్రెస్ భవనం నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువ లేనిదన్నారు. రాష్ట్రం సాధించిన అనంతరమే జర్నలిస్టులకు ఎంతో చేయాలని ఉన్నా సాధ్యపడలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుక్షణం జర్నలిస్టుల సంక్షేమం గురించే ఆలోచన చేస్తారన్నారు. వారి ఆదేశానుసారమే అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, రాజలింగం, సీనియర్ జర్నలిస్టు జమాల్‌పూర్ గణేష్, బీఆర్ఎస్ నాయకులు ఎనుగంటి శ్రీనివాస్‌గౌడ్, మాస్త ప్రభాకర్, బడుగు సత్యం, ఆకుల రజినీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బ్యాడ్మింటన్ పోటీలకు స్పందన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మోపాల్: మోపాల్ గ్రామశివారులోగల ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ క్లబ్, నిజామాబాద్ బాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన క్రీడకు అనూహ్య స్పందన వచ్చింది. సుమారు 315 ఎంట్రీలు వచ్చాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వాసు, కేవీ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. అండర్ -11, 13, 15, 17, 19 విభాగాల్లో వివిధ కేటగిరీల క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, నాందేడ్ జిల్లా నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి క్రీడాకారుడికి సర్టిఫికెట్, మెమోంటో, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఆర్గనైజర్లు గంగాధర్ గౌడ్, శ్రీకాంత్, ఫిట్‌నెస్ క్లబ్ వ్యవస్థాపకుడు నవనీత్‌రెడ్డి, కోచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

మా బాబుకు చూపు ప్రసాదించరూ!

- మూడేళ్ల బాలుడికి కంటి సమస్య
- ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

రెంజల్: తోటివారితో సరదాగా ఆడుకోవాల్సిన ఆ బాలుడు కంటి సమస్యతో ఇంటికే పరిమితమయ్యాడు. అందరితో కలిసి బడికి వెళ్లాల్సిన వయస్సులో కళ్లు కనిపించక ఇబ్బందులు పడుతున్నాడు. తమ బాబుకు వచ్చిన కష్టం చూసి నిత్యం మదన పడుతున్న తల్లిదండ్రులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్నా.. అప్పులు చేసి వైద్యం చేయిస్తున్నారు. భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో దాతలు చేయూత అందించాలని వేడుకుంటున్నారు. వివరాలు.. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన మంగళి ఆనంద్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ జీవిస్తాడు. ఆయన భార్య కూలీ పనులకు వెళ్తుంది. కరోనా సమయంలో ఆ దంపతులకు రెండో కుమారుడు దీక్షిత్ జన్మించాడు. కరోనా సమయంలో ఆస్పత్రుల్లో చేర్చుకోకపోవడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో భార్యను చేర్పించాడు. ఏడో నెలలోనే ఒక కేజీ బరువుతో బాబు జన్మించాడు. అతనికి సాధారణ బరువు తీసుక వచ్చేందుకు డాక్టర్లు ప్రయత్నించారు. దాంతో ఆ సమయంలో రూ.నాలుగు లక్షల వరకు ఖర్చయింది. డబ్బులు పోయినా బాబు బతికాడని వారు సంబరపడ్డారు. కానీ ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలువ లేదు. అదే ఆస్పత్రిలో రెండు నెలల తర్వాత జనరల్ చెకప్‌కు వెళ్లే బాబుకు కంటి సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించి హైద్రాబాద్‌కు రిఫర్ చేశారు. హైద్రాబాద్‌లోని ఎల్ వీ ప్రసాద్ ఆస్పత్రితో పాటు మరో రెండు ఆస్పత్రుల్లో చూయించినా సరైన ఫలితం లభించలేదు. బాబు వయసు పెరిగిన కొద్దీ నరాల సమస్య తొలగి కంటి చూపు వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పి డాక్టర్లు టాబ్లెట్‌లు ఇచ్చారు. రెండు నెలల కిందట గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు ద్వారా స్థానిక వైద్యులను చూయించగా వారు నిజామాబద్‌కు రిఫర్ చేశారు. నిజామాబాద్ నుంచి హైద్రాబాద్‌లోని సరోజినిదేవి ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షలు చేసి శుక్లం ఆపరేషన్ నిర్వహించి కంటిపై ఉన్న తెల్లపొర తొలగించారు. బాబుకు మరో రెండు కంటి ఆపరేషన్‌లు చేయించాలని మెరుగైన ఆస్పత్రుల్లో చేయించాలని వైద్యులు సూచించడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కంటి చూపును అందించే మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైద్రాబాద్ నుంచి ఇంటికి చేరుకునేందుకు డబ్బులు లేక బస్టాండ్‌లో అడుక్కున్నామని వారు వాపోయారు. దాతలు ఆదుకుంటే చెన్నైలోని కంటి ఆస్పత్రికి తరలించి బాబును కాపాడుకుంటామని తండ్రి ఆనంద్ వేడుకుంటున్నాడు.



కంటి సమస్యతో బాధపడుతున్న బాబుతో తల్లిదండ్రులు

దాతలు సంప్రదించాల్సిన వివరాలు

ఫోన్ పే నంబర్ :
99635 62313 (ఆనంద్)

బ్యాంక్ అకౌంట్ నంబర్ :
79055050610
తెలంగాణ గ్రామీణ బ్యాంకు

ఐఎఫ్‌సీ కోడ్ : SBINO RRDCGB

ఆలయాల అభివృద్ధికి కృషి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కల్లూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలో దేవాలయాల పునఃనిర్మాణానికి, అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కోటగిరి మండలం కల్లూర్‌లో రూ.21 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రూ.9లక్షలతో నిర్మించిన గ్రామ దేవతల మందిరాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆలయాలకు అవసరమగు నిధులు ఇస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి, వివిధ కమ్యూనిటీ హాళ్లకు రూ.రెండు కోట్లు కేటాయించామన్నారు. కల్లూర్–కొడిచర్ల బీటీ రోడ్డుకు రూ. 90లక్షలు మంజూరు చేశామన్నారు. సర్పంచ్ లక్ష్మీలింగప్ప, ఎంపీటీసీ సుజాత వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఎంపీపీ సునీతశ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రూర్‌లో గర్భగుడి ద్వారం ప్రతిష్ఠాపన

రుద్రూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ మందిరం గర్భగుడి ద్వారం (గడప) ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఎంపీపీ సుజాత నాగేందర్, వైస్ ఎంపీపీ సట్కరి సాయిలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పత్తి రాము, పత్తి నవీన్, డౌర్ సాయిలు, వెంకటేశం సేట్, కేవీ మోహన్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



సదాశివనగర్: సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు బాగుందని కేంద్ర వై ద్య బృందం ప్రతినిధులు నిర్మల్ నేగి, రీతకర్లా అన్నారు. సోమవారం పీహెచ్‌సీని వారు సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించా రు. ఓపీ వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో నాటిన మొక్కలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆస్మా, సీహెచ్‌వో నాగరాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, నక్షత్ర, ఏఎన్ఎంలు ఉష, వకుల, స్వరూప పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్వర్ణయుగం



ఆర్మూర్‌లో దివ్యాంగునికి అన్నం తినిపిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్ : సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్రంలో దివ్యాంగులకు స్వర్ణయుగం వచ్చిందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో ఆర్మూర్ నియోజకవర్గంలోని దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా వచ్చే నెల నుంచి అర్హులైన దివ్యాంగులందరికీ ప్రస్తుతం వస్తున్న పింఛన్‌కు అదనంగా వెయ్యి పెరిగి రూ.4,116 పింఛన్ వస్తుందన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి వేలాదిగా తరలివచ్చిన దివ్యాంగులకు భోజన సదుపాయం కల్పించగా పలువురు దివ్యాంగులకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్వయంగా అన్నం తినిపించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.





బడి బాట పట్టిన విద్యార్థులు




వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు సోమవారం ప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. సుదీర్ఘ సెలవుల తర్వాత పాఠశాలకు రావడంతో స్నేహితులతో సందడిగా గడిపారు. నగరంలో బోర్గాం(పి) పాఠశాలలలో సాక్షి తీసిన చిత్రాలు..

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

తండ్రిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఆస్తి విషయంలో తండ్రి, తమ్ముడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సోమవారం పెద్దపుల్ల నిషాంత్ అనే యువకుడు ఆస్తి పంపకం విషయంలో తన తండ్రి నారాయణ, చిన్న తమ్ముడు నితీష్‌పై కర్రతో దాడి చేసి గాయపరిచాడని ఎస్సై తెలిపారు. నారాయణ ఫిర్యాదు మేరకు నిషాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడిసె దగ్ధం



మాచారెడ్డి: గ్యాస్ పొయ్యి మీద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని కాకులగుట్ట తండా పంచాయతీ పరిధిలో చెరువుకొమ్ము తండాలో చోటుచేసుకుంది. వివరాలు.. మాలోత్ సుమన్ భార్య సునీత సోమవారం ఉదయం వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో సునీత, ఏడాది పాప గుడిసెలో ఉన్నారు. మంటలు చెలరేగడంతో కేకలు వేస్తూ పాపను తీసుకుని బయటకు పరుగులు తీసింది. దీంతో తండా వాసులు మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో రూ.10 వేల నగదు, వంట సామగ్రి, ఇతర వస్తువులు కాలిపోయాయి.

డ్రెయినేజీలో పడి మాజీ కౌన్సిలర్ మృతి



అబ్దుల్ ముజీబ్

కామారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మహ్మద్ అబ్దుల్ ముజీబ్(45) మృతి చెందాడు. పట్టణ సీఐ నరేష్ తెలిపిన వివరాలు.. టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ముజీబ్ ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి సుభాష్ టాకీస్ వెనకాల ఉన్న మురికి కాలువ కల్వర్టుపైన కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. సోమవారం తెల్లవారు జామున స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య షహనాజ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ముజీబ్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2015లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన ఎంఐఎం తరఫున కౌన్సిలర్‌గా గెలుపొందారు.

చికిత్స పొందుతూ అటవీ శాఖ అధికారి మృతి

కామారెడ్డి టౌన్: పురుగుల పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ అటవీ శాఖ సెక్షన్ అధికారి సోమవారం మృతి చెందాడు. పట్టణ సీఐ నరేష్ తెలిపిన ప్రకారం.. కామారెడ్డి డివిజన్ అటవీ శాఖ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న నామాల వెంకటస్వామికి 2019లో నందిపేట్‌కు చెందిన సరితతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లి నామాల లక్ష్మి, భార్య, పిల్లలతో కలిసి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ ఏడాది జనవరి 24న సరిత భర్తతో గొడవ పెట్టుకుని ఇద్దరు కూతుళ్లతో తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సరిత తల్లి లక్ష్మి, తమ్ముడు రజనీకాంత్ వెంకటస్వామిని మానసికంగా వేధిస్తున్నారు. కూతుళ్ల విషయంలో భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. పిల్లలపై బెంగతో ఈనెల 10న వెంకటస్వామి పురుగుల మందు తాగాడు. జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట్ అశ్విని ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెండాడు. తన కొడుకు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి నామాల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశామని సీఐ తెలిపారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి



బాల్కొండ: బాల్కొండలోని ఖిల్లాలో శివాలింగంపై కాలు పెట్టి అవమానించిన ఓ వర్గం యువకుడిని అరెస్టు చేయాలని వీడీసీ, వీహెచ్‌పీ సభ్యులు డిమండ్ చేశారు. వారు సోమవారం రాత్రి బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. సదరు యువకుడు తన ఫేస్‌బుక్ ఖాతాలో ఆ ఫొటో పెట్టాడన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే వారితో కఠినంగా వ్యవహరించాలన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఎస్సై గోపికి ఫిర్యాదు చేశారు. కాగా సదరు యువకుడు హత్యాయత్నం కేసులో గతంలో జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిసింది.